ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం | 12 అక్టోబరు, 2026 | పేజీలు : 08

## నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/కమలాపూర్:** హుజురాబాద్ నియోజకవర్గం శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి చేతుల మీదుగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నేడు కమలాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కమలాపూర్ తహాశీల్దార్ సురేష్ కుమార్ ఒక ప్రకటనలు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు సకాలంలో హజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు.

# మున్సిపాలిటీలో పడకేసిన పారిశుద్ధ్యం!

### దుర్గంధం వెదజల్లుతున్న చెత్త కుప్పలు.. రోగాల భయంతో ప్రజలు

### భూపాలపల్లిలో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య నిర్వహణ.. పట్టించుకోని మున్సిపల్ అధికారులు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడం, మురుగు నీరు నిలిచిపోవడం, అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించాల్సిన అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**చెత్త కుప్పలతో దుర్గంధం:** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీ రామాలయం మెయిన్ రోడ్డు లో అట్లాగే బస్టాండ్ ఏరియాలో ఎమ్మార్వో కార్యాలయం దారిలో పైలెట్ కాలనీలో చెత్త చెదారంతో నిండి ఉంది. అట్లాగే కృష్ణ కాలనీ గిరిజన ఆశ్రమ పాఠశాలకు ఎదురుగా ఉన్న మెయిన్ రోడ్డులో చెత్తను తొలగించకపోవడంతో రోడ్డుపై కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కృష్ణ కాలనీ అంబేద్కర్ స్టేడియం మెయిన్ గేటు ఎదురుగా ఉన్న చెత్తకుండీలో చెత్త నుండి బయట పడుతుంది. తొలగించడంలో అధికారుల వైఫల్యం కనబడుతుంది. పారిశుద్ధం పై కమిషన్ పర్యవేక్షణ కొరబడిందని చెప్పొచ్చు. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో కుప్పలుగా పేరుకుపోతోందని ప్రజలు చెబుతున్నారు. దీంతో పరిసరాల్లో దుర్గంధం వ్యాపించి



వివరాలు 2లో

### నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో

# ఘనంగా నిర్వహించాలి



### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వారి సతీమణి నాయిని నీలిమ రెడ్డితో పద్మాక్షి దేవాలయంలో అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి నవరాత్రి ఉత్సవాలను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకలని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నాగిళ్ల పద్మనాభ అవధాని శంకర్ శర్మ వేద పండితులు ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేద మంత్రాలతో ఆశీర్వచన అందజేసినారు. కార్యక్రమంలో పదో డివిజన్ మాజీ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, దేవాలయ కార్యకర్తలు నీలారపు రాజకుమార్, ఆకుతోట సంతోష్, సదానందం, కనుకుంట్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అంగడి ఆదాయమే ముఖ్యం..

# సౌకర్యాలు పట్టవా?

### మరుగుదొడ్లు లేక మహిళల అవస్థలు పట్టించుకోని మున్సిపల్ అధికారులు

**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే వారపు అంగడి మున్సిపాలిటీ ఆదాయాన్ని సమకూరుస్తున్నా వ్యాపారులు, చిన్న సన్నకారు రైతులు, మహిళలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు. గత మూడేళ్లుగా నిర్వహిస్తున్న ఈ అంగడికి చుట్టుపక్కల గ్రామల నుండి రైతులు, వ్యాపారులు కూరగాయలు, ఇతర వస్తువులను తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. అంగడి నిర్వహణ కోసం టెండర్ల ద్వారా కాంట్రాక్టును కేటాయించి, ఒక్కో వ్యాపారి నుండి రూ.50 చొప్పున వసూలు చేస్తున్నట్లు సమాచారం. అయితే కొందరి నుండి రూ.50 నుండి రూ.60 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంగడి ద్వారా ఆదాయం పొందుతున్నప్పటికీ తాగునీరు, మరుగుదొడ్లు తదితర కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు.

**ఇప్పటికైనా స్పందించాలి:** మున్సిపాలిటీ అధికారులు అంగడి ప్రాంగణంలో మహిళలు, వ్యాపారులు, రైతులకు అవసరమైన మరుగుదొడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. కాంట్రాక్టర్ వసూళ్లపై విచారణ జరిపి, నిర్ణీత రుసుము మాత్రమే వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అంగడి ఆదాయం పొందడమే కాకుండా, అక్కడికి వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యతను కూడా అధికారులు గుర్తించాలని కోరుతున్నారు.



## రైతు వేదికల్లో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్

**ప్రజాపక్షం/వేలేరు:** వేలేరు మండలంలోని రైతు సోదరులకు నేడు ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి మాట్లాడనున్నారని వేలేరు మండల వ్యవసాయశాఖ అధికారి కవిత ఒక ప్రకటనలో తెలిపారు.ఈసందర్భంగా కవిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు,రైతులకు సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు.కనుక వేలేరు మండలంలోని రైతులందరూ తమసమీపంలోని రైతు వేదికలకు హాజరై వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

## రామప్ప ఇఓను సన్మానించిన బాదం ప్రవీణ్



**ప్రజాపక్షం/వెంకటాపూర్(రామప్ప):** సేవా భావంతో పాటు భక్తి శ్రద్ధలు గల అధికారి ఇమ్మడి భాస్కర్ అని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ అన్నారు. ఆదివారం పాలంపేట గ్రామంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని దర్శించుకుని దేవాలయం కార్యానిర్వహణ అధికారి ఇమ్మడి భాస్కర్ ను కలిసి ఘనంగా సన్మానించారు. వందల సంవత్సరాల క్రితం ఏర్పడిన రామప్ప దేవాలయం ప్రధాన సోమసూత్ర ద్వారాన్ని భారత పురావస్తు శాఖ అధికారులను సమన్వయం చేసుకొని ఐదు నెలల కాలంలో సమస్యను పరిష్కరించడం గొప్ప విషయం అని అన్నారు. మరి కొన్ని వివిధ సమస్యలను కూడా దాతల సహకారంతో భక్తులకు సౌకర్యమైన పనులు చేయడం అభినందనీయమని తెలిపారు. ఉద్యోగం పట్ల నిబద్ధత తన విధుల్లో అలసత్వం లేకుండా పనిచేసే వ్యక్తిత్వం గల వ్యక్తి ఈవో భాస్కర్ అని కొనియాడారు. వృత్తి ధర్మాన్ని పాటిస్తూ ఇంకా ఏదో చేయాలనే తపన గల వ్యక్తిత్వం ఉన్న అధికారి భాస్కర్ అని, రామప్ప దేవాలయం కోసం మరిన్ని అభివృద్ధి పనులు చేసి ఉన్నతమైన అధికారిగా పేరు సంపాదించుకోవాలని ప్రవీణ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్ ,జిల్లా వైశ్య సంఘం అధ్యక్షులు కొమురవెల్లి రమేష్ ,రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి శిరుప సతీష్ ,జిల్లా రైస్ మిల్లర్స్ ఉపాధ్యక్షులు అక్కలరగోత్తం, ములుగు యూనిట్ ఆవోపా అధ్యక్షులు కొండ్లె కృష్ణమూర్తి, సీనియర్ వ్యాపారవేత్తలు అక్కినపల్లి ప్రభాకర్, రమణయ్య లు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న మమత బాలకృష్ణ

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** ముల్కనూర్ బస్టాండ్‌లో గుంతల కారణంగా ప్రయాణికులు, ఆర్టీసీ బస్సుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గతంలో రోడ్డు నిర్మాణంలో భాగంగా బస్టాండ్ పక్కన నూతన డ్రైనేజీ కాలువలు నిర్మించడంతో బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లేందుకు ఆటంకం ఏర్పడింది.ఈ సమస్యను గుర్తించిన ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ కాసుగోని మమత బాలకృష్ణ మానవతా దృక్పథంతో స్పందించి తన సొంత నిధులతో ట్రాక్టర్‌తో మట్టి పోసి చదును చేయించి మరమ్మతులు చేయించారు. ప్రయాణికుల ఇబ్బందులను తొలగించి తన బాధ్యతను చాటుకోవడంతో స్థానికులు, ప్రయాణికులు ఉపసర్పంచ్ దంపతులను అభినందిస్తున్నారు.

## బతుకమ్మ పండుగలో ఆకతాయిలపై చర్యలు తప్పవు



**ప్రజాపక్షం/కమలాపూర్:** తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణంగా ప్రత్యేకంగా జరిగే అతి పెద్ద పండుగను తెలంగాణ మహిళలు అతి పెద్ద పండుగగా జరుపుకోవడం తెలంగాణకే తలమానికంగా ఉంటుందని, అలాంటి పండుగ సుఖసంతోషాలతో జరిగే విధంగా ప్రతి ఇంటి ఆడపిల్లలకు గౌరవం లభించే విధంగా తెలంగాణ పోలీస్ పనిచేస్తుందని కమలాపూర్ సిఐ నవీన్ తెలిపారు. బతుకమ్మ పండుగ సందర్భంగా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు బతుకమ్మ ఆటపాటలతో సందడి చేస్తున్న మహిళల విషయంలో ఆకతాయిలు ఫోటోలు తీయడం, అసభ్యకరంగా మాట్లాడడం, ఇతర చర్యలకు పాల్పడితే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయడం జరుగుతుందని యువతకు పిలుపునిచ్చారు. ప్రతి ఇల్లు ఆ ఇంటి కుటుంబ సభ్యులు ప్రశాంత వాతావరణంలో ఎంగిలిపూల బతుకమ్మ నుంచి దసరా పండుగ వరకు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా యువత గంజాయి, మాదకద్రవ్యాల వంటి వాటి జోలికి పోకుండా తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలని, ఎలాంటి అనుమానం వచ్చినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకోని కమలాపూర్ మండలంలోని అన్ని గ్రామాలలో పోలీసులు బందోబస్తు ఉంటుందని సిఐ తెలిపారు.

## భద్రకాళీ ఆలయంలో విద్యుత్ కోతలు లేవు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండలోని శ్రీ భద్రకాళి దేవాలయంలో విద్యుత్ కోతలు విధించారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని టీజీఎన్‌పీడీసీఎల్ హనుమకొండ డిఈ జి .సాంబరెడ్డి ఖండించారు. ఆలయంలో ఎలాంటి సాధారణ విద్యుత్ కోతలు విధించలేదని ఆయన స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భద్రకాళి దేవాలయ మాడవీధుల్లో రథోత్సవం సందర్భంగా రథం సాఫీగా తిరిగేందుకు వీలుగా విద్యుత్ లైన్ల ఎత్తును పెంచే పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులను కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా), దేవాదాయ శాఖ, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పర్యవేక్షించారని వివరించారు.ఈ క్రమంలో దేవాలయ పరిసరాల్లో 11 కెవి లైన్ లో రెండు 11 మీటర్ల విద్యుత్ స్తంభాల ఎత్తును పెంచినట్లు పేర్కొన్నారు. భద్రతా ప్రమాణాలను పాటిస్తూ అభివృద్ధి పనులు నిర్వహించేందుకు అవసరమైన సమయంలో మాత్రమే విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపారు.అభివృద్ధి పనుల కోసం చేపట్టిన తాత్కాలిక విద్యుత్ నిలిపివేతను సాధారణ విద్యుత్ కోతలుగా చిత్రీకరిస్తూ అవాస్తవ ప్రచారం చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన విద్యుత్ సదుపాయాలు కల్పించేందుకు విద్యుత్ శాఖ అన్ని ఏర్పాట్లు చేశామని, నిరంతర విద్యుత్ అందిస్తున్నామని డిఈ జి .సాంబరెడ్డి స్పష్టం చేశారు.

## విద్యార్థిని యశికకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు




**ప్రజాపక్షం/కేయూక్యాంపస్:** హనుమకొండలోని ప్రోగ్రెస్ హైస్కూల్ విద్యార్థిని బోయిని యశిక తన అసాధారణ ప్రతిభతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. కేవలం 8 సంవత్సరాల 4 నెలల 15 రోజుల వయసులోనే మానవ శరీరంలోని 9 వ్యవస్థలకు సంబంధించిన 110 భాగాల పేర్లను ఒక్క నిమిషంలో చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్–2026లో స్థానం సంపాదించింది. ఈ సందర్భంగా అక్టోబర్‌లో ప్రోగ్రెస్ హైస్కూల్‌లో యశికకు అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి నేరెళ్ల వెంకట హైమ పూజిత, కాకతీయ విశ్వవిద్యాలయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలు డాక్టర్ కె. అనితారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రోగ్రెస్ హైస్కూల్ ప్రిన్సిపల్, కరస్పాండెంట్ మల్లాది ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహించగా, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం రెక్టర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొని చిన్నారి యశికను అభినందించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, చిన్న వయసులోనే అసాధారణ జ్ఞాపకశక్తి, ప్రతిభతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గౌరవం తెచ్చే స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి విజయాలు స్ఫూర్తినిస్తాయని తెలిపారు.యశిక సాధించిన ఈ ఘనత పాఠశాలతో పాటు ఆమె తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచింది. చిన్న వయసులోనే జాతీయ స్థాయి రికార్డును సాధించిన యశికను పలువురు అభినందించారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సిజెపికి మద్దతు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను పునాదులతో సహా కూల్చివేస్తూ, ఎన్నికల ప్రక్రియ పారదర్శకతను ప్రశ్నార్థకం చేస్తున్న విధానాలకు నిరసనగా ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఆందోళన కార్యక్రమాలకు ‘వరంగల్ కవులు, కళాకారుల ఐక్యవేదిక’ పరిపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఐక్యవేదిక బాధ్యులు పేర్కొన్నారు. ఆదివారం హన్మకొండలోని అంబేద్కర్ సెంటర్ వేదిక పక్షానా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రాజ్యాంగబద్ధంగా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం తన బాధ్యతల నుండి వైదొలగి, అధికార పక్షానికి కొమ్ముకాస్తుండటం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని, నిష్పక్షపాతంగా వ్యవహరించడంలో విఫలమైన కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ తక్షణమే రాజీనామా చేయాలని వేదిక కన్వీనర్ వల్లంపట్ల నాగేశ్వరావు అన్నారు. కోకన్వీనర్ నిధి, బిల్ల మహేందర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో జరుగుతున్న అక్రమాలు, లెక్కింపు ప్రక్రియలో వెల్లువెత్తుతున్న అనుమానాలపై ప్రజలకు సమాధానం చెప్పలేని స్థితిలో సీఈసీ నిలబడటం నేరమని, ఓటర్ల జాబితా అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, పారదర్శకతను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాఫంట్ నేత రమాదేవి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం నిర్బంధాలు స్వస్తి పలికి, ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాలని అన్నారు.కార్యక్రమంలో కవులు, ప్రజా సంఘ నాయకులు పి.చందు, సింగరాజు రమాదేవి, ఎస్. రేవతి, కాజీపేట పురుషోత్తం, రాజ్ కుమార్, పి. కళాధర్,ఎండి. సర్వర్ బాబు, అలీమ్,కె.దేవదాసు,బి. రమాదేవి, వి.దిలీప్, ఏ. హనుమాన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో పడకేసిన పారిశుద్ధ్యం!

మొదటి పేజీ తరువాయి

అటుగా వెళ్లే ప్రజలు, సమీప నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తలో పందులు, వీధి కుక్కలు సంచరిస్తూ చెత్తను చెల్లాచెదురు చేయడంతో పరిసరాలు మరింత అపరిశుభ్రంగా మారే ప్రమాదం ఉంది. కొన్ని చోట్ల మురుగు కాలువలను సక్రమంగా శుభ్రం చేయకపోతే దోమల బెడద కూడా పెరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

**రోగాల ముప్పు పొంచి ఉందనే ఆందోళన:** పరిసరాల పరిశుభ్రత లోపిస్తే ప్రజారోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. దోమలు, ఈగలు పెరిగే పరిస్థితులు ఏర్పడితే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులతో పాటు కలుషిత వాతావరణం వల్ల ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు అపరిశుభ్ర వాతావరణం వల్ల ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడవచ్చని పేర్కొంటున్నారు.

**పారిశుద్ధ్య సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ ఏదీ..?**

మున్సిపాలిటీ పరిధిలో ప్రతిరోజూ చెత్త సేకరణ, రోడ్ల శుభ్రత, మురుగు కాలువల నిర్వహణ, చెత్త కుప్పల తొలగింపు వంటి పనులు సక్రమంగా జరగాల్సి ఉంది. అయితే ఆయా పనుల అమలుపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పారిశుధ్య సిబ్బంది విధులను సమర్థంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, చెత్త సేకరణలో ఎక్కడైనా నిర్లక్ష్యం ఉంటే దానిని సరిదిద్దాలని సూచిస్తున్నారు.

**ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి:** పట్టణంలో పారిశుధ్య సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. చెత్తను ప్రతిరోజూ తొలగించడం, మురుగు కాలువలను శుభ్రం చేయడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం, అవసరమైన చోట్ల చెత్త సేకరణ కేంద్రాలను క్రమబద్ధీకరించడం వంటి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి భూపాలపల్లి పట్టణంలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచి, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

## ఎల్ నో ప్రభావంపై రైతులతో వీడియో కాన్ఫరెన్స్

**ప్రజాపక్షం/నడికూడ:** నడికూడ మండలంలోని నడికూడ,రాయపర్తి, కంఠాత్మకూర్ రైతువేదికలలో 12/10/2026 (సోమవారం) మధ్యాహ్నం12:00 గం.లకు రాష్ట్ర ముఖ్యమంత్రి,వ్యవసాయ శాఖ మాత్యులు రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారని మండల వ్యవసాయ అధికారి జై సింగ్ తెలిపారు.వారు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం,వర్షపాతంలో మార్పులు,వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు,నీటి యాజమాన్యం,నేలలో తేమ సంరక్షణ,రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు తదితర వ్యవసాయ సంబంధిత అంశాలపై చర్చించనున్నారని ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటల సాగు ప్రణాళికను రూపొందించుకోవాలని ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమమునకు రైతులు, ప్రజాప్రతినిధులు అందరూ సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరుతున్నామని తెలిపారు.

## పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

**ప్రజాపక్షం/తాడ్వాయి:** విద్యుత్‌ను ఆదా చేయాలని ప్రభుత్వాలు, అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నప్పటికి క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. మండల వ్యాప్తంగా వీది ధీపాలు పట్టపగలే వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. సకాలంలో ఆపివేయడంలో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తూ విద్యుత్ వృదాకు కారణం అవుతున్నారు.ఆటోమెటిక్ టైమర్ల నిర్వహణ లోపం, పర్యవేక్షణ కొరవడడమే ఇందుకు ప్రధాన కారణాలుగా స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి నియంత్రన చర్యలు తీసుకొని ప్రజాధనం వృథాని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## సత్యనారాయణ పరామర్శించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండలంలోని కోల్కొండ గ్రామానికి చెందిన ఏఎంసీ డైరెక్టర్ నల్ల సత్యనారాయణ తల్లి ఇటీవల మృతిచెందగా నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలుచల్లి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్ కుమార్, నాయకులు పాండు, కృష్ణ, శ్రీనివాస్, నాగరాజు, గణేష్, సుధాకర్ రెడ్డి, వెంకన్న, పాల్గొన్నారు.

# ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రజాపక్షం/పాలకుర్తి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. నూతన జిల్లాలు ఏర్పడి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి పెద్దపీట వేశామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకన్న, మహేందర్ నాయక్, రేణుక, సురేష్, అనిత, ఉపేందర్, కల్పన, శ్రీనివాస్, నాయకులు వినయ్‌రావు, అశోక్ రెడ్డి, నవీన్‌కుమార్, శ్రీనివాసరావు, నాగిరెడ్డి, ఉప సర్పంచ్ గాదెపాక కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** చిన్న మండలాలు, చిన్న జిల్లాలతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ముందు చూపుతోనే మాజీ సీఎం కేసీఆర్ మండలాలను, జిల్లాలను ఏర్పాటుచేశారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిలి జగన్మోహన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మండలం ఏర్పడి 10 సంవత్సరాలు అయిన సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మళ్లీ బీఆర్ఎస్ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి లింగం, ప్రభుదాస్, శ్రీనివాస్ రెడ్డి, పద్మజా వెంకట్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, రామరాజు, జుంలాల్ నాయక్, రాజేశ్వర్ గౌడ్, జైఅల్, పాల్గొన్నారు.

# గోవిందరావుపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా బత్తిని వెంకట్



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** లక్నవరం గోవిందరావుపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా బత్తిని వెంకట్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఆదివారం గోవిందరావుపేట రైతు వేదికలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు అధ్యక్షుడిగా బత్తిని వెంకట్ సాక్షి,ప్రధాన కార్యదర్శిగా సామ బుచ్చిరెడ్డి నవతెలంగాణ,ఉపాధ్యక్షుడిగా పగడాల వాసురెడ్డి ఆంధ్రప్రభ,కోశాధికారిగా తుక్కాని ఎల్లారెడ్డి మన తెలంగాణ,సంయుక్త కార్యదర్శిగా కక్లెం రవీందర్ రెడ్డి వార్త ఎన్నికయ్యారు,ఎన్నికల పరిశీలకులుగా ఆకుల యుగేందర్ ఈనాడు,నెక్కంటి సునీల్ ఆంధ్రజ్యోతి వ్యవహరించారు సమావేశంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు ఈ సందర్భంగా బత్తిని వెంకట్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి బాధ్యతలు అప్పగించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పనిచేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో పగడాల శ్రీకాంత్ రెడ్డి ప్రజాపక్షం, మోడం సారంగపాణి నమస్తే తెలంగాణ, నర్ర రఘువీర్ టీవీ9,జన్నారపు రమేష్ 6టీవీ, వేమునూరి సతీష్ టీవీ5,గొల్లపల్లి శ్రీకాంత్ ప్రజావాణి, చందుపాష జనం సాక్షి, యోగి పీపుల్స్ డైరీ, సంపత్ పాల్గొన్నారు.

# జనగామ జిల్లాను ముట్టుకుంటే ఊరుకోం

**ప్రజాపక్షం/జనగామ :** జనగామ జిల్లాను ముట్టుకుంటే ఊరుకోం. చెప్పాతో కొట్టాలనుకుంటే బూటుతో సమాధానం చెబుతామని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం నాటికి జిల్లా ఏర్పడి 10 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా బిఆర్ఎస్ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాలు నిర్వయించారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ జనగామలో పోరాట యోదుల గడ్డ అని, కొట్లాడి తెచ్చుకున్న జనగామను ఆగం చేస్తే ఎవరు ఊరుకోరన్నారు. ప్రజలకు పాలన దగ్గర కావాలనే ఉద్దేశ్యంతో కేసీఆర్ 10 జిల్లాలను 33 జిల్లాలుగా చేశారని, మండలాలు 600కు పైగా ఏర్పాటు చేశారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ అని జోస్యం చెప్పారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జనగామ



ప్రజలు కేసీఆర్‌ను మరిచిపోలేరన్నారు. కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి లాంటి వారు జిల్లాలను మార్చాలని, పాత జిల్లాలుగానే ఉంచాలని చూస్తున్నారన్నారు. కేసీఆర్ ముందు చూపుతో కరెంట్ ఇస్తే రేవంత్ రెడ్డి కరెంట్ ఇచ్చే పరిస్థితి లేదని ముందే చెబుతున్నారన్నారు. 52వేల కోట్ల రూపాయలు విద్యుత్ శాఖకు చెల్లించాల్సి ఉండగా ఒక్క రూపాయి ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో గద్దల నర్సింగరావు, బాల్నె సిద్దిలింగం, భూష పర్వతాలు, చెవెల్లి సంపత్, గాంధీనాయక్, పెద్ది రాజిరెడ్డి, పోకల జమున, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, బంద పద్మ, బంద యాదగిరిరెడ్డి, చౌదర్‌పల్లి శేఖర్, ధర్మపురి శ్రీనివాస్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు, మండల పార్టీ అధ్యక్షులు, పాల్గొన్నారు.

# ఉద్యమకారుల పోరాట ఫలితంగానే జనగామ జిల్లా ఆవిర్భావం

**ప్రజాపక్షం/జనగామ:** ఉద్యమకారుల పోరాటం ఫలితంగానే జనగామ జిల్లా ఆవిర్భవించిందని యాదాద్రి లక్ష్మి నర్సింహ్మస్వామి ట్రస్ట్‌బోర్డు సభ్యులు డాక్టర్ లక్ష్మి నారాయణ నాయక్, ప్రముఖ వైద్యులు డాక్టర్ సిహెచ్ రాజమౌళి, డాక్టర్ సుగుణాకర్‌రాజు, కన్నా పరశరాములు, సాదిక్ అలీ అన్నారు. జనగామ జిల్లా స్థానికేతరుల వలన కుటుంబు పడిందని, జనగామ ఎమ్మెల్యే అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. జనగామ జెఎసి ఆధ్వర్యంలో ఆదివారం జనగామలోని విజయ పంక్షన్ హాల్‌లో జనగామ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి నారాయణ నాయక్ మాట్లాడుతూ జనగామ జిల్లా అస్తిత్వం కోసం ఉద్యమకారులు తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాటం చేశారన్నారు. తెలంగాణలోనే జనగామ జిల్లాకు ప్రత్యేకత ఉందని, తెలంగాణ



రైతాంగ సాయుధ పోరాటం ఉవ్వెత్తున్న సాగడంతో పాటు దొడ్డి కొమురయ్య, సాకలి ఐలమ్మ, బందగి వంటి ఎంతో మంది అమరులైన నేల జనగామ అన్నారు. అలాంటి జనగామను అప్పటి ప్రభుత్వం విస్మరించిన నేపథ్యంలో ప్రజలు ఒక్కటై రాజకీయాలకు అతీతంగా ఉద్యమాలు నిర్వహించాల్సి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మేడ శ్రీనివాస్, రెడ్డి రత్నాకర్‌రెడ్డి, మంగళంపల్లి రాజు, తిప్పారు విజయ్ కుమార్, శ్రీనివాస్, సతీష్, రామేశ్వరచారి, రాగళ్ల ఉపేందర్, గండి నాగరాజు, బొట్ల సుమతి తదితరులు పాల్గొన్నారు.

# రామప్పకు పూర్వ వైభవం

**ప్రజాపక్షం/ములుగు:** యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప ఆలయ అభివృద్ధికి ఈవో ఇమ్మడి భాస్కర్ చేస్తున్న సేవలు అభినందనీయమని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ అన్నారు. ఆదివారం రామప్ప ఆలయాన్ని దర్శించుకున్న ఆయన



ఈవో భాస్కర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంలో ప్రధాన సోమసూత్ర ద్వారం సమస్యను భారత పురావస్తు శాఖతో సమన్వయం చేసుకుని ఐదు నెలల్లో పరిష్కరించడం అభినందనీయమన్నారు. దాతల సహకారంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న పనులు ప్రశంసనీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తున్న ఈఓ భాస్కర్ ఇదే స్ఫూర్తితో ఆలయ అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమురవెల్లి రమేష్, రెడ్‌క్రాస్ కోశాధికారి శిరుప సతీష్, రైస్ మిల్లర్స్ సంఘం కోశాధికారి ఎలగందుల మోహన్, ఉపాధ్యక్షుడు అక్కల రఘు ఉత్తమ్, ములుగు ఆవోపా అధ్యక్షుడు కొండ్లె కృష్ణమూర్తి, వ్యాపారవేత్తలు అక్కినపల్లి ప్రభాకర్, ఇమ్మడి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# విద్య,డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** ఎస్ఆర్ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో, 2026–2027 సంవత్సరానికి సంబంధించిన ఏడు రోజుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా,చివరి రోజు (ఆదివారం) హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో విద్య, డిజిటల్ అక్షరాస్యత కెరీర్ అభివృద్ధిపై అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. విద్యార్థులు డిజిటల్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని,సాంకేతిక పరిజ్ఞానాన్నివిద్యాభ్యాసానికి సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఎన్ ఎస్ఎస్ వాలంటీర్లు సూచించారు.ఈ కార్యక్రమానికిఎల్లాపూర్ గ్రామ జడ్ పిహెచ్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల కమిటీ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై,విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూవిద్య, క్రమశిక్షణ, డిజిటల్ పరిజ్ఞానం కెరీర్ ప్రణాళిక విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఎన్ఎస్ ఎస్ వాలంటీర్లు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఎస్ఆర్ యూనివర్సిటీఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అక్టోబర్ 5 నుంచి 11, 2026 వరకు ఎల్లాపూర్ గ్రామంలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో గ్రామ సర్వే ఎన్ఎస్ఎస్ జెండా ఆవిష్కరణ, గ్రామ సర్వే,స్వచ్ఛ భారత్ పరిశుభ్రత కార్యక్రమం గ్రామంలో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఆరోగ్యకరమైన పరిసరాల ప్రాముఖ్యత,వర్షపు నీటి సంరక్షణ,నీటి పొదుపు, వర్షపు నీటి నిల్వ, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు.ఈ ఏడు రోజుల ప్రత్యేక శిబిరం ద్వారా గ్రామీణ అభివృద్ధి, విద్య, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య అవగాహన,సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలనే సంకల్పంతో శిబిరం ముగిసింది.

# జిల్లా దశాబ్ది వేడుకలకు బిఆర్ఎస్ శ్రేణుల ర్యాలి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** జిల్లా ఆవిర్భావ దశాబ్ది వేడుకలకు మండలంలోని పలు గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి, బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, మండల అధ్యక్షుడు తీగల దయాకర్‌గౌడ్, ఏల సుందర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఏల సుందర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం జనగామలో నిర్వహించిన దశాబ్ది వేడుకలలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిజెపి జెండా తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** ఉప్పుగల్లు గ్రామంలో బీజేపీ వార్డు సభ్యుడు నేరెళ్ల రాజు ఇంటి ముందు ఏర్పాటుచేసిన జెండా గద్దెపై నుంచి పార్టీ జెండాను ఉద్దేశపూర్వకంగా తొలగించిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నగేష్ గౌడ్ డిమాండ్ చేశారు. గ్రామంలోని పార్టీ నాయకులతో కలిసి జెండా స్థూపాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు శ్వేత, రాజుగౌడ్, తిరుపతిగౌడ్, రాజు, రమేష్, పవన్ గౌడ్, ప్రసాద్ గౌడ్, నరేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# బిసిలకు కులగణన రాజ్యాంగబద్ధ హక్కుగా గుర్తించాలి




**ప్రజాపక్షం/జనగామ టౌన్:** బీసీలకు కులగణను రాజ్యాంగ బద్ధ హక్కుగా గుర్తించాలని రాష్ట్ర బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ టి చిరంజీవులు డిమాండ్ చేశారు. ఆదివారం జనగామలోని కెమిస్ట్ భవన్‌లో జిల్లా బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం సమావేశం గద్దం అనిల్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ బీసీలంతా ఐక్యంగా ఉండి, విద్య, రాజకీయ రంగాలలో అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి మాట్లాడుతూ ఫోరంలో మహిళలకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. బీసీలు, మైనార్టీలు ఐక్యంగా పనిచేసి సమాజంలో అవగాహన పెంచాలని పలువురు వక్తలు సూచించారు. ఈ సమావేశంలో అభిగౌడ్, రాజశేఖర్, అడ్వకేట్ సాధిక్ అలి, శ్రీకాంత్, ప్రభాకర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# కలిసి పనిచేసే ఐక్యత చాటాలి

**ప్రజాపక్షం/పరకాల :** పద్మశాలి కులస్తులంతా కలిసి పనిచేసే ఐక్యతను చాటాలని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు అన్నారు. ఇటీవల పరకాల పట్టణ పద్మశాలి కుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన వేముల ఆంజనేయులు ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పరకాల పట్టణంలో ఉండబడిన పద్మశాలి కులస్తుల అంతా కలిసి పని చేయాలన్నారు. కులస్తులు ఎదుర్కొంటున్న అనేక రకాలైన సమస్యలను అధ్యయనం చేసి వాటిని పై కమిటీలకు చేరవేసినట్లయితే వాటన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారం చేసే విధంగా చేయడం జరుగుతుందన్నారు. ఒక్కో కుటుంబంలో ఉండబడిన ప్రతి వ్యక్తి సమస్యను తెలుసుకోవలసిన బాధ్యత సంఘం బాధ్యులపై ఉంటుందని శ్రీరాములు అన్నారు. సంఘం అంటే ఓ కుటుంబం అని ఆ కుటుంబ పెద్ద ఇంట్లో ఉండబడిన సమస్యల పరిష్కారం కు ఏ విధంగా ప్రయత్నం చేస్తాడు ఆ కుల పెద్ద ఆ విధంగా ప్రయత్నం చేయాలి అన్నారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న అనేక రకాలైన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అర్హులైన వారికి చేరే విధంగా చూడాలన్నారు. వేముల ఆంజనేయులు ఆ విధమైన ప్రయత్నాలు చేస్తాడని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. పద్మశాలి కుల సంఘం ప్రధాన కార్యదర్శిగా మొగిలి యువజన విభాగం అధ్యక్షుడు దాసరి రవి కార్యదర్శి పల్సాటి సతీష్ లు ప్రమాణ స్వీకారం చేశారు. పద్మశాలి కులస్తుల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారిగా మెండు రవీందర్ వ్యవహరించినట్లు శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోప పరకాల మండలం అధ్యక్షుడు డాక్టర్ రాజేశ్వరప్రసాద్ , వేముల సదానందం, దుంపేట నాగరాజు, పరకాల పట్టణంలోని పద్మశాలి కులస్తులు జిల్లా మండల స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఉషాదయాకర్



ప్రజాపక్షం/–రాయపర్తి:– మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన మాక్స్‌కేర్ హాస్పటల్ డైరెక్టర్, ఎంజిఎం మాజీ ఆర్ఎం కుందూరు వెంకట్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి దశ దినకర్మలో ఆదివారం ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్ రావు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## ఆడబిడ్డకు ఆరాధన కాదు.. సమానత్వమే అసలైన గౌరవం!

ప్రజాపక్షం/నెక్కొండ: ఆడబిడ్డలో ఆదిశక్తిని చూస్తూ, సరస్వతీ దేవితో పోలుస్తూ పూజించే సమాజం...అదే ఆడపిల్లకు అన్ని రంగాల్లోద సమాన అవకాశాలు కల్పించడంలో వివక్ష చూపడం ఎంతవరకు సమంజసమని తెలంగాణ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు, మాజీ ఎంపిపి గటిక అజయ్‌కుమార్ ప్రశ్నించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఆడబిడ్డలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆడపిల్లలకు సమాన హక్కులు, అవకాశాలు, గౌరవం కల్పించినప్పుడే నిజమైన సమానత్వ సమాజం ఆవిర్భవిస్తుందని పేర్కొన్నారు. ఆడబిడ్డల ఆశయాలకు అడ్డంకులు సృష్టించకుండా, వారి కలలకు రెక్కలొచ్చి ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఆడపిల్లలకు గౌరవించడం మాటల్లోనే కాకుండా చేతల్లోనూ చూపాలని, వివక్షకు తావులేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అజయ్‌కుమార్ ఆకాంక్షించారు.

## అంతర్జాతీయ బాలికల దినోత్సవం




ప్రజాపక్షం/నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని స్వయంకృషి సంస్థ కార్యాలయం లో అంతర్జాతీయ బాలికల దినోత్సవం అక్టోబర్ 11 సందర్భంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంకృషి స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్ బాలికలు ఉద్దేశించి మాట్లాడుతూ సృష్టి కి కారణం అయిన ఆడపిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుందామని, వారికి బంగారు భవిష్యత్‌ను అందించడానికి అందరం కృషి చేద్దాం అని పిలుపునిచ్చారు. బాలికలకు తప్పనిసరి సెకండరీ విద్యను అందించి వారు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించడానికి చేయుత నుఅటందించాలని కోరారు. అను నిత్యం సమాజంలో ఆడపిల్లలు వివక్షను ఎదుర్కొంటూ ఎక్కడో ఒక చోట లైంగిక వేధింపులకు గురి కావడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలు ధైర్యంగా సమస్యలను ఎదిరించే స్థాయికి ఎదగాలని, మానసిక స్థైర్యాన్ని కలిగి ఉండాలన్నారు. బాలల చట్టాల పైన అవగాహన కలిగి ఎప్పుడైనా ఎక్కడైనా ఆడపిల్లలకు సమస్యలు ఎదురైతే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ 100టోల్ ఫ్రీ నెంబర్ కి సమాచారం అందించి రక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమం లో బాలికలు గిరగాని నివ్య, కృష్ణ, విశ్రుత, ధ్రువ, శన్విత పాల్గొన్నారు.

# కలెక్టర్ బ్రీడింగ్ చెక్కర్స్‌ను ఆదుకోవాలి

### బ్రీడింగ్ చెక్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు భూక్య శ్రీనివాస్ నాయక్



ప్రజాపక్షం/చెన్నారావుపేట: జిల్లా కలెక్టర్ బ్రీడింగ్ చెక్కర్స్ ను విధుల్లోకి తీసుకొని తమ కుటుంబాలను ఆదుకోవాలని బ్రీడింగ్ చెక్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు భూక్య శ్రీనివాస్ నాయక్, ఉపాధ్యక్షులు చిన్నపెల్లి దేవేందర్ లు కోరారు. ఆదివారం చెన్నారావుపేట మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వరంగల్ జిల్లాలోని గ్రామాలలో బ్రీడింగ్ చెక్కర్స్ గా పనిచేయడానికి విధుల్లోకి తీసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజారెడ్డికి ఆదేశాలు జారీ చేశారన్నారు. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజారెడ్డిని సెప్టెంబర్ 30వ తేదీన మర్యాదపూర్వకంగా కలిసి తమను విధుల్లోకి తీసుకోవాలని కలవగా తమ నుండి దరఖాస్తులను కూడా స్వీకరించినట్లు తెలిపారు. కానీ ఇప్పటివరకు విధుల్లోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తమను విధుల్లోకి తీసుకునే విధంగా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రీడింగ్ చెక్కర్స్ ముత్యం రాజు, శేఖర్, రామ్ చందర్, భద్రయ్య, సూర్య, రవి, బాబు, రామ్ కుమార్, సిహెచ్ రాజు, దేవేందర్, రాజేశ్వరరావు, చాణిక్య, సరిత, సల్లా వుద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలి



ప్రజాపక్షం/నర్సంపేట: పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని బిఆర్ఎస్ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జీ మోటూరి రవి అన్నారు. నర్సంపేట మండలంలోని గురిజాల గ్రామంలో బిఆర్ఎస్ గ్రామ కమిటీ నాయకులు నీళ్ల లేక ఎండిపోతున్న పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ మోటూరి రవి మాట్లాడుతూ గురిజాలలో చాలామంది రైతులు వరి, ఇతర పంటలు సాగు చేశారని నీళ్ల లేక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి అధికారుల ద్వారా సర్వే చేయించి ఎకరాకు యాభై నష్టపరిహారం రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో అధిక వర్షాలు పడి రైతులు నష్టపోతే స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సహకారంతో ఆరోజు రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు గడ్డం కొమురయ్య, బండారి రమేష్, మాజీ రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ అన్న రాజమల్లు, అల్లి రవి, మాజీ ఉప సర్పంచ్ మంచిక హరీష్, వార్డు సభ్యుడు గజ్జి రాము, గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు మంచిక దేవేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పత్రి కుమారస్వామి, యూత్ మండల ప్రధాన కార్యదర్శి సంగం శ్రీకాంత్, సీనియర్ నాయకులు మర్ద నవీన్, నీలం కృష్ణమూర్తి, చిర్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

### వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



ప్రజాపక్షం/వరంగల్: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కుటుంబ సమేతంగా ఆదివారం వరంగల్‌లోని శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కుటుంబ సమేతంగా విచ్చేసిన జిల్లా కలెక్టర్‌కు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలు చేపట్టి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో భద్రకాళి అమ్మవారి ఆలయం భక్తులతో సందడిగా మారింది. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అమ్మవారి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా ఆలయ పరిపాలన విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రకాళి ఆలయంలో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతున్నాయని వారు పేర్కొన్నారు.

# హక్కుల సాధనకు బిసిలంతా ఏకం కావాలి



### బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి

ప్రజాపక్షం/నర్సంపేట: అన్ని రంగాల్లో బిసిలను వెనక్కి నెట్టేస్తున్నా, ఆర్థిక రాజకీయ సామాజిక న్యాయాన్ని అందకుండా చేస్తున్నా బిసిలు కులాలుగా, రాజకీయంగా చీల్చబడి ఉండటం వల్లనే బిసిలకు విద్య ఉద్యోగ చట్టసభల్లో బడ్జెట్లో ద్రోహం జరుగుతుందని బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు. బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా రెండవ మహాసభలు అక్టోబర్ 16న వరంగల్ శివనగర్ ఉర్సు జంక్షన్ లో ఉన్న రాజశ్రీ గార్డెన్ లో జరగనున్న సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కపెల్లి రమేష్, సివిల్ సప్లై హమాలి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్, బిసి హక్కుల సాధన సమితి జిల్లా ఉపాధ్యక్షులు ఇల్లందుల సాంబయ్యలతో కలిసి నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు మహాసభల పోస్టర్‌లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా లెక్కలతో పాటు బిసి కులాల లెక్కలు తీసి ఒక్కో కులానికి ఒక్కో యూనిక్ నెంబర్ ఇవ్వాలన్నారు. బిసి జనాభా లెక్కల ప్రకారం సకల రంగాలలో బిసిల వాటా బిసిలకు చెందే విధంగా కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచడం కోసం కార్యాచరణ ప్రణాళిక ఈ మహాసభలో రూపొందించుకొని జిల్లాలో బిసిలను రాజకీయాలకతీతంగా సమీకరించడానికే ఈ మహాసభలు జరుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిసి మండల నాయకులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల భవనాలకు రూ.45లక్షల నిధులు మంజూరు

### ఖానాపురం మండలంలోని ఆరు గ్రామాలకు నిధుల కేటాయింపు

ప్రజాపక్షం/ఖానాపురం: ఖానాపురం మండలంలోని ఆరు గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి రూ.45లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఏఎంసి వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, పిఏసిఎస్ చైర్మన్ వల్లే శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బతుకమ్మ పండగ సందర్భంగా మహిళా సంఘాల భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ మహిళా సంఘాల తరుపున ఎంఎల్‌ఏకు కృతజ్ఞతలు తెలిపారు. నిధుల వివరాల ప్రకారం అశోక్‌నగర్‌కు రూ.10లక్షలు, ఖానాపురానికి రూ.7లక్షలు, మంగళివారిపేటకు రూ.8లక్షలు, కొత్తూరుకు రూ.5లక్షలు, బుధరావుపేటకు రూ.5లక్షలు, ధర్మారావుపేటకు రూ.10లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ భవనాలు మహిళా స్వయం సహాయక సంఘాల సమావేశాలు, ఆర్థిక కార్యకలాపాలు, శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడతాయని వారు తెలిపారు.

## నెక్కొండ ఎస్ఐగా జలగం శ్రవణ్ కుమార్



ప్రజాపక్షం/నెక్కొండ: నెక్కొండ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా జలగం శ్రవణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. జిల్లా సిపి శ్వేతా ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం మిల్స్ కాలనీ ఎస్ఐగా పనిచేస్తున్న ఆయన సోమవారం నుండి నెక్కొండ ఎస్ఐగా విధులు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. గతంలో నెక్కొండలో ప్రొబెషనరీ ఎస్సైగా పనిచేసిన శ్రవణ్ కుమార్‌కు మండల ప్రజలో ఇప్పటికే పరిచయం ఉంది. ఆయన నియామకంపై అధికారిక స్పష్టత వచ్చేసింది. గతంలోని నెక్కొండ ఎస్సైగా పనిచేసిన మహేందర్ ఎస్ఐ కొన్ని కారణాల వలన సస్పెండ అయిన విషయం విధితమే, ప్రస్తుతం ఆయన దుగ్గొండి ఎస్ఐగా మహేందర్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

## మృతుల కుటుంబాలకు శ్రీనివాస్ రెడ్డి పరామర్శ



ప్రజాపక్షం/రాయపర్తి: మండలంలోని మహబూబ్‌నగర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పెండ్లి మల్లారెడ్డి, పెండ్లి కొమురరెడ్డి తల్లి పెండ్లి వెంకటనర్సమ్మ, కొలనుపల్లి గ్రామానికి చెందిన గాజుల దివ్య ఇటీవల మరణించగా ఆదివారం మృతుల కుటుంబాలను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత, టిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం గాజుల దివ్య కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, నూనె క్యాన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌టి యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగారెడ్డి, తాళ్లపెల్లి సంతోష్‌గౌడ్, చందు రామ్, చందు లక్ష్మణ్, రవీందర్, గాదె రవీందర్ రెడ్డి, లక్కం కుమార్, గూడ రాజిరెడ్డి, సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## దళిత బంధు పథకం నిధుల విడుదల కోసం వొడితల ప్రణవ్ ప్రయత్నం



ప్రజాపక్షం/కమలాపూర్: రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ హైదరాబాద్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్ధంగా దళిత బంధు పథకం సంబంధించి నిధుల విడుదల, నియోజకవర్గంలో దళితుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

# కెసిఆర్ ప్రభుత్వం వచ్చేందుకు మరోసారి సిద్దిపేట వేదిక కానుంది

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు.. .కొత్త జిల్లాల ఏర్పాటు ముఖ్య భూమిక సిద్దిపేట పోషించిందని .. ఇప్పుడు కెసిఆర్ ప్రభుత్వం రావటానికి మరోసారి సిద్దిపేట వేదికగా మారుతుందని మాజీ మంత్రి,అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా పండుగ జిల్లా ప్రజలందరిదన్నారు. సిద్దిపేటది ప్రత్యేక పరిస్థితి అని ..రాష్ట్ర రాజధాని దగ్గర, జిల్లా కేంద్రం 150 కిమీ ఉండేదని, ఈ ప్రాంత ప్రజలు ఏ పనికి వెళ్లి తీవ్ర వ్యయప్రయాసాలకు గురయ్యేవారన్నారు. రాష్ట్రం వచ్చిన ఐదేండ్లలో రంగనాయక్‌సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, గౌరవెళి రిజర్వాయర్ నిర్మించుకున్నట్లు తెలిపారు.కెసిఆర్ వచ్చాకనే రెండు పంటలతో ఈ ప్రాంతం సస్యశ్యామలం చేశారని, కడుపు నిండ కరెంట్ ఇచ్చారన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఎప్పుడు అబద్దాలు చెప్పిన మళ్లీ పాత రోజులు తీసుకవస్తానని నిజం చేశారని మాజీ మంత్రి హరీష్‌రావు ఎద్దేవా చేశారు. ఆదివారం రాత్రి సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో సిద్దిపేట జిల్లా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన భారీబహిరంగ సభలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఇప్పుడు కరెంట్ కోతులు, అభివృద్ధి లేని రోజులను తీసుకొచ్చినట్లు తెలిపారు. ఎల్‌నినో వచ్చిందని పంటలు వేసుకోవద్దని సిఎం చెపుతున్నారన్నారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని..కాంగ్రెస్ తెచ్చిన కరువు అన్నారు. బొగ్గు లేక కరెట్ ఉత్పత్తి చేయలేకపోతున్నారన్నారు. 9నెలల క్రితం ఎల్‌నినో వస్తుందని



తెలిసిన సిఎం రేవంత్‌రెడ్డి బొగ్గు నిల్వలు ఎందుకు ఉంచలేదని ఫ్రశ్నించారు. సిఎం రేవంత్‌రెడ్డి చాతగానితనం వల్లనే ఈ కరువు అని విమర్శించారు. 24 గంటల నడపాల్సిన మోటర్లను కేవలం 8గంటలకు పరిమితం చేయటం వల్ల నీళ్లు ఉన్న రైతుల పరిస్థితి ఎడారిగా మారిందన్నారు. చంద్రబాబు నాయడు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీళ్లు కుప్పంకు తరలిస్తున్నారని ఆరోపించారు.శ్రీశైలం, గోదావరి,కన్నెపల్లి,నీళ్లు ఉన్నా మోటర్లు ఆన్ చేయకపోవటం వల్ల నీటి కరువు వచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డి చేసిన తప్పుడు తెలంగాణ ప్రజలకు చెంపలేసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణను కెసిఆర్ అద్భుతంగా ఆవిష్కరిస్తే కాంగ్రెస్ దగా చేసిందని విమర్శించారు. సిద్దిపేట ప్రజలకు తాను ఆజన్మంతం కృతజ్ఞతగా ఉంటానన్నారు. ఊపిరి ఉన్నంత కాలం పదవిలో ఉన్నా, లేకున్నా సిద్దిపేట ప్రజలకు సేవా చేస్తానన్నారు. రేవంత్‌రెడ్డి వచ్చాక సిద్దిపేటపై పగ బట్టాడని, అభివృద్ధికి నిధులు ఇవ్వకపోవటమే గాకుండ గత ప్రభుత్వంలో మంజూరైన నిధులను రద్దు చేశారన్నారు. 25 శాతం పూర్తయిన వెటర్నరీ కళాశాలను సైతం కొడంగల్‌కు తరలించుకెళ్లారన్నారు. ఇంటిగ్రేటేడ్ స్కూల్ సైతం ఇవ్వలేదని అధికారులు అడిగిన పక్కకు పెట్టాలని సూచించారన్నారు. రేవంత్‌రెడ్డి కాలంలో సిద్దిపేటకు కరువు,బాధలు తప్పా కొత్తగా వచ్చింది ఏమిలేదన్నారు. దేవుని సాక్షిగా రుణమాఫీ చేస్తానని చెప్పి మాట తప్పి దేవుళ్లను సైతం రేవంత్ రెడ్డి మోసం చేశారన్నారు. ఎనుమల రేవంత్‌రెడ్డి కాదని ఎగవేతల రేవంత్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు.రుణమాఫీ 40 చేస్తే 60 శాతం ఎగ్గొట్టారన్నారు. సిద్దిపేట నర్మెట్ట సాక్షిగా 45రోజుల్లో రైతు బంధు వేస్తానని చెప్పి ఇప్పటికి 200 రోజులైన వేయలేదని విమర్శించారు. కెసిఆర్ రైతుకుటుంబాల కోసం రైతుబీమా తేస్తే రేవంత్‌రెడ్డి రద్దు చేసి కుటుంబాలను ఆగం చేశారన్నారు. మళ్లీ కెసిఆర్ పాలన కోసం సిద్దిపేట నుండి ఉద్యమం ప్రారంభమవుతుందని హరీష్‌రావు జోస్యం చెప్పారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి. ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి. వెంకట్రామ్‌రెడ్డి. మాజీ ఎమ్మెల్యే సతీష్‌బాబు, గజ్వేల్ ఇంచార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డిలు ఫ్రసగించారు. కెసిఆర్ ప్లక్సికి రంగనాయక్‌సాగర్ గోదావరి జలాలలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అభిషేకం చేశారు.

సిద్దిపేట జిల్లా తొలి కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి,జిల్లా పరిషత్ చైర్మన్ రోజాశర్మ. ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, బక్కి వెంకటయ్య, సినీ నటుడు సంపూర్ణేష్‌బాబును మాజీ మంత్రి హరీష్‌రావు ఘనంగా సన్మానించారు.

## తెలంగాణ అభివృద్ధికి చెరగని ముద్ర వేసిన కేసీఆర్



**ప్రజాపక్షం/గజ్వేల్ :** తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు అభివృద్ధిలో కేసీఆర్ చెరగని ముద్ర వేసుకున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయడంతో పాటు నాచగిరి క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారధ్యంలో 33 జిల్లాలు ఆవిర్భవించి దశాబ్దం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో తీర్చిదిద్దిన ఘనత కేసిఆర్ కు దక్కిందని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సమస్యల పరిష్కారం కోసం ఇబ్బందులు పడగా, సిద్దిపేట ప్రత్యేక జిల్లా ఏర్పాటుతో ఏళ్ల తరబడిగా ఎదురు చూసిన సిద్దిపేట జిల్లా సాకారం అయిందని తెలిపారు. అంతేకాకుండా నూతన రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతో పాలన సులభతరం అయినట్లు చెప్పారు. వైద్య విద్యకు ప్రాధాన్యత మిస్తూ 33 జిల్లాలలో నూతన జిల్లా భవనాలు, వైద్య కళాశాలలు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగరావు, మాజీ చైర్మన్ రాజమౌళి గుప్త, మాజీ ఎంపీపీ అమరావతి, మాజీ జెడ్పిటిసి డాక్టర్ మల్లేశం, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ వుడెం కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు నవాజ్ మీరా, సీనియర్ నేతలు ఆకుల దేవేందర్, మంద బాలరెడ్డి, రమేష్ గౌడ్, దయాకర్ రెడ్డి, మెట్టయ్య గుప్త, వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకునూర్‌లో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



**ప్రజాపక్షం/చేర్యాల :** చేర్యాల మండలం ఆకునూర్ గ్రామంలో విజయదుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చేర్యాల ప్రజాపక్షం పత్రిక విలేకరి నర్సిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. కలశ స్థాపన, దీక్షాధారణ, కుంకుమ పూజ, పారాయణము తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పూలక్క ఆశయ సాధనకు పోరాడుదాం

**ప్రజాపక్షం/ నర్సంపేట:** సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ వరంగల్ జిల్లా కమిటి సభ్యురాలు, ప్రగతిశీల మహిళా సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సిలువేరు పూలక్క అకాల మరణం మహిళా ఉద్యమానికే కాక, వరంగల్ జిల్లా విప్లవ ఉద్యమానికి తీరని నష్టమని ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ నాయకురాలు సంధ్య అన్నారు. కామ్రేడ్ పూలక్క సంతాప సభ నర్సంపేట పట్టణంలోని ఆమె స్వగృహం నందు న్యూ డెమోక్రసీ పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సభలో సంధ్య మాట్లాడుతూ పితృ స్వామిక సమాజంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు, అణచివేతలకు, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ప్రగతిశీల మహిళా సంఘం పనిచేస్తుందని, ఈ సంఘంలో కామ్రేడ్ పూలక్క గత నాలుగు సంవత్సరాలుగా పనిచేయడం చేసిందని అదే క్రమంలో జిల్లాలోని మహిళా సమస్యలపై రైతు కూలీల కార్మికుల సమస్యలపై కూడా ఆమె పని చేసిందన్నారు. డెంగ్యూ జ్వరం వలన పూలక్క మరణించిందని, ఆమె కోరుకున్న ఆశయ సాధన కోసం మనమంతా పనిచేయాలని ప్రజలను కోరారు. సభలో ఐఎఫ్‌టియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జాతీయ నాయకులు ఆరెల్లి కృష్ణ, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బండి కోటేశ్వర్‌రావు, ఏఐకేఎంఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల తిరుపతి, రాచర్ల బాలరాజు, ఉపాధ్యక్షులు గట్టి కృష్ణ, బొమ్మిడి సాంబయ్య, పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, మహిళా సంఘం నాయకురాలు స్వరూప, శైలజ, లక్ష్మక్క, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, కుమార్, బండి కుమార్, స్వామి, బీమగాని మల్లయ్య, బరిగల కుమారస్వామి, గొర్రె ప్రదీప్ లతోపాటు జిల్లాలోని పార్టీ ప్రజాసంఘాల కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలతోనే సామాజిక మార్పు

**ప్రజాపక్షం/నెక్కొండః** విద్యా చైతన్యం, సామాజిక సమానత్వం, ఆత్మగౌరవంతోనే సమాజంలో మార్పు సాధ్యమని స్వేరో రాష్ట్ర అధ్యక్షుడు మంద శ్యామ్ అన్నారు. ఆదివారం నెక్కొండలోని అంబేద్కర్ భవన్‌లో ఈదునూరి యాకయ్య అధ్యక్షతన నిర్వహించిన స్వేరో ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలు, భావజాల స్ఫూర్తితో ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ స్వేరో ఉద్యమం ద్వారా కృషి చేశారని పేర్కొన్నారు. దళితులు సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించి అన్ని రంగాల్లో సమాన హక్కులు పొందేలా అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ కళ్లెపెల్లి సురేష్, కోకన్వీనర్ జేరిపోతుల వెంకటేశ్వర్లు, మాసాని రమేష్, గోవింద్ మురారి, స్వేరో మండల కన్వీనర్ బొల్లెపల్లి శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ సన్నిధిలో కొండా సురేఖ ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్‌లోని నర్సంపేట రోడ్డులో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో నిర్వహించిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో మాజీ మంత్రి వరంగల్ తూర్పు ఎంఎల్‌ఏ కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం వంచనగిరిలోని శ్రీ కోటగంటి మైసమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలపై అమ్మవారి కృపాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గమ్మ ఆలయ పూజారి వంశీ, కోటగండి మైసమ్మ ఆలయ పూజారి అయ్యప్ప, కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు గోపాల నవీన్‌రాజ్, వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, డివిజన్ అధ్యక్షులు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## శ్రీ విద్యాదరి నామస్మరణతో మార్మోగిన శంభూగిరులు



**ప్రజాపక్షం/గజ్వేల్ :** శరన్నవరాత్ర మహోత్సవ పర్వదినాల్లో జగన్మాత ప్రతిరూపమైన శ్రీ సరస్వతిదేవిని భక్తి శ్రద్ధలతో అర్చిస్తే ఆధ్యాత్మిక జ్ఞానం సిద్ధిస్తుందని క్షేత్ర వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ, యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి అన్నారు. ఆదివారం ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో నవరాత్ర మహోత్సవాలకు అంకురార్పణ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బాల త్రిపుర సుందరీ దేవి అవతారంలో శ్రీ విద్యాధరి అమ్మవారు భక్తులకు దర్శన భాగ్యం కల్పించగా, ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిద్ధాంతి చంద్రశేఖర శర్మ ప్రసంగిస్తూ ఈ ఆధ్యాత్మిక ప్రయాణంలో గొప్ప అనుభూతులు నెలకొనగా, ప్రస్తుతం ఆ పరిమళాలు ప్రతి ఒక్కరిలో దైవచింతన పెంపొందిస్తున్నట్లు స్పష్టం చేశారు. నవరాత్ర మహోత్సవ పర్వదినాలు ఆధ్యాత్మిక సాధకులకే కాకుండా లౌకిక జీవితాన్ని గడిపే ప్రతి ఒక్కరికి చక్కటి సందేశం ఇస్తుందని తెలిపారు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించమని శ్రీ సరస్వతి మాత, శాంతి, శ్రేయస్సు కోసం శ్రీ లక్ష్మీ దేవిని ప్రార్థించాలని, అడ్డంకులు తొలగడానికి శ్రీ దుర్గామాతను సేవించాలని ఆకాంక్షించారు. శుభప్రదమైన ఈ పర్వదినాల్లో పుణ్య స్థలాలు దర్శించి దేవి దేవతలను అర్చించాలని, తద్వారా ఆధ్యాత్మిక భావన, మానసిక ప్రశాంతత దక్కుతుందని చెప్పారు. కాగా మొదటగా క్షేత్రంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ శ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఆస్థాన వేద పండితులు బాల ఉమామహేశ్వర శర్మ పరివారం అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, గణపతి పూజ, కలశ స్థాపన, అంకురార్పణ, చండీ హోమం, ప్రత్యేక పూజలు తదితర ఘనంగా నిర్వహించారు. క్షేత్రానికి విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతో పాటు మహాప్రసాదం అందజేయగా, శ్రీ విద్యాధరి అమ్మవారి నామస్మరణతో ఆలయ సముదాయం మార్మోగింది.

## కళ్ళకల్‌లో వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** మనోహరాబాద్ మండల పరిధిలోని కళ్ళకల్ గ్రామంలో శ్రీ వనదుర్గ కాలకంటి బంగారమ్మ అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని విశేషంగా అలంకరించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు,అమ్మవారి అలంకరణ కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బాలా త్రిపుర సుందరి దేవి రూపంలో కొలువుదీరిన బంగారమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. అమ్మవారిని దర్శించుకుని భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు. నవరాత్రుల సందర్భంగా ఆలయంలో భక్తిమయ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో కళ్ళకల్ గ్రామ సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజ్ గౌడ్, ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్ పాల్గొని శ్రీ వనదుర్గ కాలకంటి బంగారమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో వారు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు



పొందారు.బంగారమ్మ భక్త బృందం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నవరాత్రులలో అమ్మవారి వివిధ రూపాలను దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి కనబరుస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు ఆకాంక్షిస్తున్నారు. కళ్ళకల్ గ్రామంలో సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తుల్లో భక్తిభావాన్ని పెంపొందిస్తూ గ్రామంలో ఆధ్యాత్మిక సందడిని తీసుకొస్తున్నాయి. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థిస్తున్నారు. ఈ పూజ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి వేణుగోపాల్, కుమ్మరి నాగరాజు మాత, నీతికుంట సత్యనారాయణ మాత, ఇతర మాటలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవారి ప్రతిష్టాపన, మాలధారణ



ప్రజాపక్షం/శివ్వంపేట : మండల కేంద్రమైన శివ్వంపేటలోని బగలాముఖి శక్తిపీఠంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు. ఈసందర్భంగా తాజా మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా దంపతులు పూజలలోపాల్గొనగా పబ్బ మహేశ్‌గుప్తా అమ్మవారి మాల దారణ స్వీకరించారు. అదేవిధంగా శివ్వంపేట మండలంలోని పిల్లుట్ల గ్రామంలో గ్రామ పురోహితులు చండికాశర్మ, ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో ప్రతిష్టాపన కార్యక్రమం జరగగా మొదటిరోజు బాలత్రిపుర సుందరీదేవి అవతారంలో భక్తులకు ధర్శనం ఇచ్చారు. పలువురు భక్తులు అమ్మవారి మాలదారణదీక్షను స్వీకరించారు.

## నేడు రైతు వేదికల్లో రైతు నేస్తం ప్రత్యక్ష ప్రసారం



ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట: తెలంగాణ ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు నేడు సోమ వారం ఉదయం 10 గంటలకు పెద్ద శంకరంపేట మండలంలోని శివాయిపల్లి, రామోజీపల్లి రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం కానుందని మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని రైతులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన సూచించారు.

## మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు ఆత్మీయ సత్కారం



ప్రజాపక్షం/చేర్యాల: చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన చేర్యాల పట్టణ వ్యాపారవేత్త దుద్దెల కృష్ణను, కృష్ణ బాల్యమిత్రులు ఆత్మీయ సత్కారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఔదర్ల నర్సింహులు ఫామ్‌హౌజ్‌లో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ నాయకులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం కృషిచేస్తానని, సమస్యలుంటే తనను సంప్రదించాలని దుద్దెల కృష్ణ రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో దుద్దెల కృష్ణ ఆత్మీయ బాల్యమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు కోతలతో… రైతుల పాలిట శాపంగా మారిన కాంగ్రెస్ సర్కార్



ప్రజాపక్షం/గజ్వేల్ : కరెంటు కోతలు, ఎండుతున్న పంటలతో రైతుల పాలిట రేవంత్ రెడ్డి సర్కార్ శాపంగా మారిందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి విమర్శించారు. ఆదివారం మండల పరిధిలోని పిడిచేడులో మాజీ జెడ్పీటిసి డాక్టర్ మల్లేశంతో కలిసి ఎండిపోతున్న పంటలను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లలో సాగునీరు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో 10 రోజులు పంట పొలాలకు సాగునీరు అందితే ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కరువు తీవ్ర రూపం దాలుస్తుందగా, ఎండుతున్న పంటలు చూసి రైతులు ఆవేదన చెందుతున్నట్లు విమర్శించారు. అప్పులు తెచ్చి పంటలు సాగు చేయగా, వాటిని తీర్చే మార్గం కానరాక రైతులు ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఆరు గాలం కష్టించి పండిస్తున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు రూ. వేలు ఖర్చు చేస్తూ ట్రాక్టర్లతో నీరు తెచ్చి పంటలకు తడులు పెడుతున్నట్లు చెప్పారు. సాగు నీటి కోసం కష్టపడుతున్న రైతులను ఏడిపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి వారి ఉసురు తగులుతుందని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కరెంటు కొనుగోలు చేసి పంటలు కాపాడాలని, రిజర్వాయర్లలో ఉన్న సాగు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## టిఆర్ఎస్ లో… భారీగా చేరికలు



ప్రజాపక్షం/గజ్వేల్ : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డులకు చెందిన మహిళలు గజ్వేల్ మండల తెలంగాణ రక్షణ సేన ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులు లింగని రాజు ఆధ్వర్యంలో, రాష్ట్ర ఉపాధ్యక్షులు సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం ఉద్యమ కారులు, బడుగు బలహీన వర్గాలకు ఎలాంటి న్యాయం జరగలేదని విమర్శించారు. టిఆర్ఎస్ పార్టీని స్థాపించిన కల్వకుంట్ల కవిత సారథ్యంలోనే వారికి సముచిత న్యాయం జరుగుతుందని చెప్పారు. సామాజిక న్యాయమే ధ్యేయంగా పార్టీ పని చేస్తుందని, పేద ప్రజలకు ఉచిత విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సామాజిక న్యాయం తెలంగాణ రక్షణ సేనతోనే సాధ్యమని ప్రజలు భావిస్తున్నట్లు తెలిపారు. పాంచజన్య అంశాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని, పార్టీలో చేరిన నేతలు రాజమ్మ, భారతమ్మ, మమత, నరసవ్వ, రేణుక, యాదమ్మ తదితరులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎద్ద నర్సింలు, యువజన విభాగం అధ్యక్షులు కూరాకుల శ్రీకాంత్, రాంచంద్రం, కనకరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## దేశ విదేశాల్లో కూడా బతుకమ్మ సంబరాలు



ప్రజాపక్షం/కొండపాక : తెలంగాణలో అతిపెద్ద పండుగైన బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. ఇక్కడి ప్రజలే కాకుండా తెలుగు ప్రజలు ఎక్కడ ఉన్నా మన సంస్కృతి సంప్రదాయాలను చాటి చెప్పేలా దేశ విదేశాల్లో కూడా బతుకమ్మ సంబరాలు జరుపుకుంటున్నారు. ఇక్కడ ఉంటున్న వారికి అక్కడ జరిపే పండుగ విశేషాలను బంధువులకు స్నేహితులకు షేర్ చేసుకుని పండుగ విశిష్టతను విస్తృత పరుస్తున్నారు. అమెరికాలోని లూయిస్ విల్లేలో బతుకమ్మ సంబరాలను తెలుగు రాష్ట్రాల మహిళలు ఒకటై చిన్న బతుకమ్మ పండుగను ఘనంగా ప్రారంభించారు. ముందుగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి అక్కడ ఉన్న తెలుగువారి దేవాలయాల వద్ద మహిళలు అంతా ఏకమై పండుగ ను ఘనంగా జరుపుకునే ఫోటోలను షేర్ చేసుకున్నారు. అలాగే బెంగళూరులో కర్ణాటక తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను జరుపుకున్నారు.

## ఏడుపాయల్లో అట్టహాసంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



ప్రజాపక్షం/పాపన్నపేట : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గామాత ఆలయ క్షేత్రంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, ఆలయ ఈవో మరం వీరేశం, అమ్మవారికి పట్టు వస్త్రలు సమర్పించి, ఉత్సవాలను ప్రారంభించారు. నవరాత్రుల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తుల సందడితో కళకళలాడాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రధాన ఆలయం నుంచి గోకుల్ షెడ్ వరకు బాజాభజంత్రీల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేక ఏర్పాటు చేసిన గోకుల్ మంటపంలో ప్రతిష్ఠించారు. తొలిరోజు శ్రీ వనదుర్గామాత బాల త్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవి శరన్నవరాత్రుల కుంకుమార్చనలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ రూరల్ సిఐ కృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ చందనా ప్రశాంత్ రెడ్డి, దంపతులతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్, మాజీ జెడ్పీటిసి మల్లప్ప, మాజీ ఆలయ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, పార్శ నర్సింలు, సర్పంచులు వెంకన్న, శ్రీధర్, నాయకులు ముశెట్టి కిష్టయ్య, కలీం, ప్రవీణ్ గౌడ్, ప్రసాద్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, ఎకోబా, అంజిరెడ్డి, వివిధ మండలాల ముఖ్య నాయకులతో పాటు ఆలయ సిబ్బంది సార శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. పూజల అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. నవరాత్రి ఉత్సవాలకు విచ్చేసిన భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాపన్నపేట ఎస్ఐ సారా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

## ఘనంగా అటుకుల బతుకమ్మ వేడుకలు



ప్రజాపక్షం/అల్లాదుర్గం : మండలంలోని అన్ని గ్రామాల్లో బతుకమ్మ పండుగ రెండో రోజైన అటుకుల బతుకమ్మ వేడుకలు ఆదివారం ఘనంగా, జరిగాయి. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఆడపడుచులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను జరుపుకున్నారు. తెల్లవారుజాము నుండే మహిళలు గునుగు, తంగేడు, బంతి, చామంతి వంటి రంగురంగుల పూలను సేకరించి, అందంగా బతుకమ్మలను పేర్చారు. సాయంత్రం కాగానే ప్రతి గ్రామంలోని దేవాలయాల వద్ద, బతుకమ్మ ఘాట్ల వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో ఘనంగా జరుపుకున్నారు.

## మర్పడగ క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు



ప్రజాపక్షం/కొండపాక : కొండపాక మండలం మర్పడగ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. క్షేత్ర నిర్వాహకులు దేవి ఉపాసకులు డాక్టర్ చెప్పెల హరినాథ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. కలశ స్థాపన, దీక్షాధారణ, నవావరణ హోమము, చతుషష్టి పూజ, కుంకుమ పూజ, పారాయణము తదితర కార్యక్రమాలు జరిగాయి. జిల్లా ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది.

## తొలిరోజు బాలా త్రిపుర సుందరి దేవిగా అమ్మవారి దర్శనం

ప్రజాపక్షం/అల్లాదుర్గం: మండలంలోని ఆయా గ్రామాలలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలా త్రిపుర సుందరి దేవి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. అమ్మవారి దర్శనంతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## మహిళలకు గాజులు తొడిగిన మాజీ డిప్యూటీ స్పీకర్



ప్రజాపక్షం మెదక్ : దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి మెదక్ పట్టణంలోని ఓ గాజుల దుకాణాన్ని సందర్శించి గాజులు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు ఆరేళ్ళగాయత్రి, గడ్డమీద యశోదతో కలిసి దుకాణానికి వచ్చిన మహిళలు, చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించారు. వారికి గాజులు కొనిపెట్టి, స్వయంగా తొడిగారు. నవరాత్రుల వేళ మహిళలు సంప్రదాయబద్ధంగా గాజులు ధరించడం ఎంతో ఆనందాన్నిస్తుందని పద్మాదేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. ఇటువంటి వేడుకలు మహిళలు, చిన్నారుల్లో సంతోషాన్ని నింపుతాయని తెలిపారు. పండుగల సందర్భంగా సంప్రదాయాలకు ప్రాధాన్యమివ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా దుకాణానికి వచ్చిన మహిళలు, చిన్నారులకు గాజులు కొనిపెట్టి వారితో కొద్దిసేపు ముచ్చటించారు.దీంతో దుకాణంలో పండుగ సందడి నెలకొంది.

## నోబుల్ యూత్ నూతన కార్యవర్గం

ప్రజాపక్షం/ రేగోడ : నోబెల్ యూత్ నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. నోబెల్ యూత్ అధ్యక్షులుగా శంకరంపేట నరేష్, ప్రధాన కార్యదర్శి వడ్ల సుమన్, ఉపాధ్యక్షులు సతీష్ కుమార్ వీరప్రసాద్ కోశాధికారి లక్ష్మీ కాంత్ జైన్ సెక్రెటరీ భోగం అనిల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మంగళ రాజు సోషల్ మీడియా కోఆర్డినేటర్ శేఖర్ వంశీ సభ్యులుగా సిద్ధు హరీష్ నవీన్ విజయ్ వంశీ లీగల్ అడ్వైజర్ గా దుద్దాల జగదీష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో తదితరులు ఉన్నారు



# కెసిఆర్ పాలనలోనే రాష్ట్ర అభివృద్ధి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



**ప్రజాపక్షం, తొర్రూరు :** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తొర్రూరు డివిజన్, తొర్రూరు మున్సిపాలిటీగా ఆవిర్భవించిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద బిఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ నాయకత్వంలోనే తొర్రూరుకు రెవెన్యూ డివిజన్ హోదా లభించిందన్నారు. తొర్రూరును మున్సిపాలిటీగా ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలు, పట్టణాల అభివృద్ధి పెద్దపీట వేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కరెంటు కోతలు పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సాగునీరు, విద్యుత్ సమస్యలతో పొలాలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులకు 24గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. కెసిఆర్ హయాంలోనే అమలైన రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు రైతులకు ఎంతో అండగా నిలిచాయన్నారు. తెలంగాణ అభివృద్ధికి బిఆర్ఎస్ చేసిన కృషిని ప్రజలు ఎప్పటికి మర్చిపోలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవిశరన్నవరాత్రి వేడుకలు

**ప్రజాపక్షం / వేలేరు :** మండలంలోని పలుగ్రామాలలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ మండపాల వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మ వారిని సర్పంచ్‌లు, భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని భక్తి శ్రద్దలతో అర్చకులు చౌదరి సంతోష్, చౌదరి వీరసాయి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులతో ప్రతిఇంటా ఆనందం వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారి కృపాకటాక్షాలు ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో పలుగ్రామాల సర్పంచ్‌లు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఎల్ఐసి ఏజెంట్ కుటుంబానికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం, కమలాపూర్:** కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన ఎల్ఐసి ఏజెంట్, ఎల్ఐసి ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు మంద భాస్కర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం ఆయన కుటుంబానికి ఎల్ఐసి ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక చేయూత అందించారు. ఈ సందర్భంగా భాస్కర్ కుటుంబీకులను పరామర్శించి సంతాపం తెలిపారు. అనంతరం బాధిత కుటుంబీకులకు రూ. 25 వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్ల వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పంజాల ప్రభాకర్, కార్యదర్శి వందుపట్ల నరసింహారెడ్డి, డైరెక్టర్లు కొండ తిరుపతి, బంటు కుమారస్వామి, ఏవూసి శ్రీనివాస్, వడ్డే రమేష్, జక్కు శ్రీనివాస్, బరిగే బిక్షపతి, సమ్మెట రఘు, బండారి కుమారస్వామి, ఎల్ఐసి ఏజెంట్లు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## రాజ్యాంగబద్ధ హక్కుగా గుర్తించాలి




**ప్రజాపక్షం/జనగామ:** బీసీలకు కులగణను రాజ్యాంగ బద్ధ హక్కుగా గుర్తించాలని రాష్ట్ర బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఎఎస్ టి చిరంజీవులు డిమాండ్ చేశారు. ఆదివారం జనగామలోని కెమిస్ట్ భవన్‌లో జిల్లా బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం సమావేశం గద్దం అనిల్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ బీసీలంతా ఐక్యంగా ఉండి, విద్య, రాజకీయ రంగాలలో అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి మాట్లాడుతూ ఫోరంలో మహిళలకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. బీసీలు, మైనార్టీలు ఐక్యంగా పనిచేసి సమాజంలో అవగాహన పెంచాలని పలువురు వక్తలు సూచించారు. ఈ సమావేశంలో అభిగౌడ్, రాజశేఖర్, అడ్వకేట్ సాధిక్ అలి, శ్రీకాంత్, ప్రభాకర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# రహదారి పనులు ప్రారంభం

నైన్ పాక సర్పంచ్ నక్క భాస్కర్



**ప్రజాపక్షం/చిట్యాల:** భూపాలపల్లి నియోజకవర్గ ఎంఎల్ఎ గండ్ర సత్యనారాయణరావు సహకారంతో నైన్ పాక గ్రామంలో ఆదివారం నాపాక దేవాలయం నుండి మామిడి తోట వరకు నూతన రహదారి పనులను గ్రామ సర్పంచ్ నక్క భాస్కర్ గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. సర్పంచ్ నక్క భాస్కర్ మాట్లాడుతూ దాదాపు రూ.40లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ రోడ్డు పనుల కోసం భూమి పూజ చేసి ప్రారంభించడం జరిగిందన్నారు. గ్రామంలోని ప్రధాన రవాణా సమస్యలను పరిష్కరించడమే తమ ప్రాధాన్యతని, ప్రజలందరికి మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాపాక ఆలయ కమిటీ చైర్మన్ యాదండ్ల రాజయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు కంకనాల శంకర్, వార్డు సభ్యులు కొడారి స్వప్న గణేష్, నూక రజిత వీరన్న, జనువాల చంద్రయ్య, చిన్నాల శ్రీనివాస్, నల్లబెల్లి శ్రీనివాస్, పాలడుగుల రఘుపతి, ఎల్లబోయిన శివకుమార్, జంగా బిక్షపతి, ఎర్రయ్య, గణేష్, రమేష్, రాజు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాలలో దుర్గామాత ప్రాణ ప్రతిష్టాపన



**ప్రజాపక్షం/చిట్యాల:** శ్రీ హనుమాన్ భజన మండలి ఆధ్వర్యంలో చిట్యాల బస్టాండ్ ఆవరణంలో ప్రతి సంవత్సరం నిర్వహించే శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం దుర్గామాత ప్రాణ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవీ అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ అమ్మవారి కృపాకటాక్షాలు పొందుతున్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భజన మండలి అధ్యక్షుడు సరిగోమ్ముల రాజేందర్, కార్యవర్గం, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# నోటీసులు జారీ చేయకుండా ఇళ్ల కూల్చివేత దారుణం

అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్న పేదలకు తీవ్ర నష్టం

బిజెపి రాష్ట్ర నాయకుడు నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/మల్హర్:** తాడిచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని శత్రాజ్‌పల్లిలో నిరుపేదల ఇళ్ల కూల్చివేత దుర్మార్గమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చల్లా నారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.అర్ధరాత్రి సమయంలో ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, ఇంట్లోని సామగ్రిని బయటకు తీసుకునే అవకాశం కల్పించకుండా ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని ఆయన విమర్శించారు. పేదలు తమ రెక్కల కష్టంతో పాటు అప్పులు చేసి, బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల నుంచి రూ.4.5 లక్షల వరకు ఖర్చు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల కూల్చివేతతో బాధిత కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు. గతంలో భూపాలపల్లిలో ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు బాధితులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకున్నారని గుర్తుచేస్తూ, ఇక్కడి బాధితుల విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు.బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, అర్హులకు నష్ట పరిహారంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని చల్లా నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బండా శ్రీకాంత్‌తో పాటు పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ప్రశాంత్, నిషన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు జిల్లాలో జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యుల పర్యటన

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ రేపు జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్ లో ఎస్‌టి వర్గాల నుండి వినతులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు సమగ్ర నివేదికలతో హాజరు కావాలని ఆయన సూచించారు.

## నిజానిజాలు ధ్రువీకరించుకోవాలి

ఎస్‌పి సిరిశెట్టి సంకీర్త్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సోషల్ మీడియాలో కనిపించే ప్రతి సమాచారం నిజం కాదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. ఎడిట్ చేసిన వీడియోలు, నకిలీ స్క్రీన్‌షాట్‌లు, డీప్‌ఫేక్‌లు, తప్పుడు వార్తల ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చే సమాచారాన్ని చూసిన వెంటనే నమ్మడం లేదా ఇతరులకు షేర్ చేయడం చేయకూడదని, ముందుగా దాని విశ్వసనీయతను పరిశీలించి, అధికారిక సమాచార వనరుల ద్వారా నిజానిజాలను ధ్రువీకరించుకోవాలని సూచించారు. సంచలనాత్మక పోస్టులు, భయాందోళనలు కలిగించే సందేశాలు, అనుమానాస్పద లింక్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. తప్పుడు సమాచారాన్ని షేర్ చేయడం వల్ల ప్రజల్లో అపోహలు, అనవసర భయాందోళనలు ఏర్పడే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా సోషల్ మీడియాను వినియోగించాలని ఎస్పీ గారు పేర్కొన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.

## రైతు నేస్తం నిర్వహణకు ఏర్పాట్లు

**ప్రజాపక్షం/జనగామ:** జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో సోమవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ప్రతి రైతు వేదికకు కనీసం 200 మంది రైతులు హాజరయ్యేలా, ఉదయం 11 గంటలలోపు చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రబీ పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణ, అనువైన పంటల ఎంపిక, శాస్త్రీయ సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మహిళా రైతులను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేయాలని, వ్యవసాయంతో పాటు ఉద్యానవన, పాడి, పశుపోషణ రంగాల రైతులనూ కార్యక్రమానికి సమీకరించాలని సూచించారు. ఏర్పాట్లను సంబంధిత అధికారులు సమన్వయంతో పర్యవేక్షించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి అల్లోల



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** దేవి నవరాత్రుల సందర్భంగా నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని రాష్ట్ర మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య,వైస్ చైర్మన్ గణేష్,చక్రవర్తి, కౌన్సిలర్ పెండం శ్రీనివాస్,డిసిసి అధికార ప్రతినిధి ముడుసు సత్యనారాయణ,మాజీ చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి,నిర్మల్ టౌన్ అధ్యక్షులు ఆకుల హరీష్, కౌన్సిలర్ లక్కకుల హరీష్, కోఆప్షన్ మెంబర్ మేడారం ప్రదీప్,ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ కత్తి నరేందర్,ప్యాక్స్ చైర్మన్ రమణ రెడ్డి,పిపి శ్రీనివాస్,పాకాల రాంచేందర్,మాజీ ఏఎంసీ చైర్మన్ చిలుక రమణ,తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలు ఎత్తివేయాలి




**ప్రజాపక్షం/తొర్రూరు :** గ్రామాల్లో విద్యుత్ కోతలను ఎత్తివేసి పంటలకు 24గంటల పాటు విద్యుత్‌ను అందించి రైతులను కాపాడాలని తెలంగాణ రైతు సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు గునిగంటి రాజన్న అన్నారు. ఆదివారం రైతు సంఘం తొర్రూరు మండల కార్యాలయంలో మండల అధ్యక్షుడు మట్టపల్లి కుమార్ అధ్యక్షతన మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షపాతం తక్కువగా ఉండటంతో కరువు నెలకొందని, దీంతో పాటు ఎండలు తీవ్రంగా ఉన్నాయని రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే మండలంలో కరువు పరిస్థితులు ఉన్నప్పటికి గ్రామాల్లో కరెంటు కోతలతో వరి పొలాలు ఎండిపోతున్నాయని రైతులు మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యుత్ కోతలను ఎత్తివేసి పంటలకు 24గంటల పాటు విద్యుత్‌ను అందించాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి బొల్లం అశోక్, తొర్రూరు మండల కార్యదర్శి కొత్త వెంకట్‌రెడ్డి, సోమిరెడ్డి, తాళ్ల వెంకటేశ్వర్లు, జి.సాయిలు, నరేడ్ల జితేందర్‌రెడ్డి, ఎండి.మైపాషా, ఎండి.షమీనా పాల్గొన్నారు.

## కార్పొరేట్లకు కేంద్రం ప్రోత్సాహం – సిపిఎం

**ప్రజాపక్షం/పాలకుర్తి:** కేంద్రప్రభుత్వం కార్పోరేట్ శక్తులను ప్రోత్సహిస్తూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తోందని సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య విమర్శించారు. దర్దేపల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వెంకన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దేశంలో మతతత్వం, కులతత్వం పెరుగుతున్నాయని, మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, మహిళలపై అఘాయిత్యాలు అధికమవుతున్నాయని ఆరోపించారు. వెంకన్న రైతు సంఘంలో చురుకుగా పనిచేశారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సోమసత్యం, మదార్, ఇంద్రారెడ్డి, సంపత్, అశోక్‌బాబు, కొమురయ్య, రాజు, సాంబాజీ, కొమురయ్య, కుమారస్వామి, ఉప సర్పంచ్ సోమయ్య, నర్సయ్య, మధు, రామచంద్రం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లా దశాబ్ది ఉత్సవాలు



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జనగామ జిల్లా దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం జనగామ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో విజయ ఫంక్షన్ హాల్‌లో వేడుకలను నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుమారు 70 మంది జిల్లా ఉద్యమకారులను పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సాధన ఉద్యమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉద్యమకారులపై నమోదైన కేసులను ప్రభుత్వం ఎత్తివేయాలని మంగళంపల్లి రాజు కోరారు. జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని అతిథులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.

## శ్రీరాములపల్లి పద్మశాలి అధ్యక్షుడిగా తాటిపాముల రాములు

**ప్రజాపక్షం/కమలాపూర్:** కమలాపూర్ మండలం శ్రీరాములపల్లి గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షులుగా తాటిపాముల రాములు ఏకగ్రీవంగా ఎన్నికైన్నారు. ఈ సందర్భంగా తాటిపాముల రాములు మాట్లాడుతూ... పద్మశాలీల ఐక్యత కోసం, అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడతానని, పద్మశాలీలకు, చేనేత కార్మికులకు ఏ ఆపద వచ్చిన ముందుంటానని తెలిపారు. తాటిపాముల రాములుతో పాటు డైరెక్టర్ గా తాటిపాముల తిరుపతి, వలస సాంబయ్య, మార్త రవీందర్, పెగడ శ్రీకాంత్, వెంగళ రాజు ఎన్నికైన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడికి, కార్యవర్గానికి కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్, జిల్లా అధ్యక్షులు ఆనందం, మండల అధ్యక్షులు బొప్ప శివ శంకర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి పులి కంటి రాజేందర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## జనగామలో బిసి మేధావుల సమ్మేళనం




**ప్రజాపక్షం/జనగామ:** జనగామ జిల్లా కేంద్రంలో ఆదివారం బిసి మేధావుల సమ్మేళనం జరిగింది. సూర్యపేట రోడ్డులోని కెమిస్ట్రీ భవన్‌లో ఈ కార్యక్రమం జరగగా రాష్ట్ర బిసి ఇంటలెక్చువల్ అధ్యక్షులు టి చిరంజీవులు, బిసి కమీషనర్ సభ్యురాలు బాలలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసిలు రాజకీయాధికారంలో కోసం పనిచేయాలన్నారు. బిసిలకు రావాల్సి వాటా కోసం కొట్లాడాలని, ప్రభుత్వం ఏవైనప్పటికి బిసిలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కన్నా పరశురాములుతో పాటు ఆర్‌టివి సభ్యులు అభిగౌడ్, అడ్వకేట్ జమాల్ షరీఫ్, అనిల్‌కుమార్‌గౌడ్‌తో పాటు పలువురు బిసి నాయకులు పాల్గొన్నారు.

## బిజెపి అభివృద్ధిని ఓర్వలేకనే కాంగ్రెస్ విష ప్రచారం



బిజెపి మండల అధ్యక్షుడు శ్రీనివాస్

**ప్రజాపక్షం/కమలాపూర్:** ప్రజాస్వామ్యంలో రాజ్యాంగబద్ధంగా సర్ ప్రక్రియలు నిర్వహిస్తుంటే ఓటు బ్యాంకు రాజకీయం కోసం బిజెపి అభివృద్ధిని ఓర్వలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం విష ప్రచారం చేస్తుందని భారతీయ జనతా పార్టీ కమలాపూర్ మండల అధ్యక్షులు ర్యాకం శ్రీనివాస్ ఆరోపించారు. కమలాపూర్ కమ్యూనిటీ హాల్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ... గతంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది సార్లు ఓటర్ ప్రక్రియను నిర్వహించిందని గుర్తు చేశారు. రాజ్యాంగబద్దమైన ఓటరు నమోదు ప్రక్రియను నిరంతరం కొనసాగుతుందన్నారు. బిజెపి ప్రభుత్వం పై ప్రజలకు ఆత్మవిశ్వాసం ఉందని ఆరోపణలు చేయడం వల్ల కాంగ్రెస్ పార్టీకే నష్టం జరుగుతుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బిజెపి దేశంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జెట్టి సారంగపాణి, భూపతి ప్రవీణ్, మండల ఉపాధ్యక్షులు ఇనుగాల రత్నాకర్, పెండ్యాల ప్రభాకర్ రెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు తిరుపతి రెడ్డి, ఎస్‌సి మోర్చా అధ్యక్షులు జేరిపోతుల రాజేందర్, పార్టీ సీనియర్ నాయకులు తుమ్మ శోభన్ బాబు, బండి కోటేశ్వర్ రావు, కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్, మహమ్మద్, మౌటం బాబు, బుర్ర కరుణాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ నిధులతో ప్రైవేట్ ప్రచారాలు సరికాదు




**ప్రజాపక్షం/తొర్రూరు:** మున్సిపల్ నిధులతో బతుకమ్మ వేడుకలను నిర్వహించి ప్రైవేట్ సంస్థకు ప్రచారాలు కల్పించడం సరికాదని బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు అన్నారు. తొర్రూరు పట్టణ కేంద్రంలో నిర్వహించిన బతుకమ్మ పండుగ వేడుకలపై ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కౌన్సిలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో మున్సిపాలిటీ నిధుల నుండి లక్షల రూపాయలు వెచ్చించి బతుకమ్మ పండుగను నిర్వహించారని, కానీ ఆ పండుగ ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ తెలుగు అసోసియేషన్(వేటా) నిర్వహించిందని ప్రచారం చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డిని ప్రభుత్వ కార్యక్రమంలో ఏ హోదాలో వేదికపై పిలుస్తారని అన్నారు. కౌన్సిలర్లను వేదికపైకి పిలవకుండా కాంగ్రెస్ నాయకులను పిలవడం సరికాదన్నారు. సౌకర్యాలు లేక మహిళలు ఇబ్బందులు పడ్డారన్నారు. కనీసం తాగేందుకు మంచినీరు సైతం ఏర్పాటు చేయలేదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు కర్నె నాగరాజు, ఖుసాని జయమ్మ ఉప్పలయ్య, చకిలేల అలివేలు మణిరాజ్, తూర్పాటి రవి, పేర్ల జంపన్న, మాద్గుల భవాని లత, ధరావత్ పద్మ కిషన్, శ్యామల శ్యామ్, కిన్నెర కవిత సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## 26వ ఏట అడుగుపెడుతున్న ములుగు రావణ వధ ఉత్సవాలు

### ఈ సారి మున్సిపాలిటీలో తొలిసారి వేడుకలు..ట్రస్టు ఏర్పాటుకు సన్నాహాలు



**ప్రజాపక్షం/ములుగు:** ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో ములుగులో నిర్వహిస్తున్న రావణ వధ, నరకాసుర వధ ఉత్సవాలు 26వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాయి. గత 25 ఏళ్లుగా ప్రజల ఆదరణతో కొనసాగుతున్న ఈ వేడుకలు ఈసారి మున్సిపాలిటీలో తొలిసారిగా నిర్వహించనున్నారు. ఉత్సవాల నిర్వహణలో వ్యక్తుల కంటే వ్యవస్థకే ప్రాధాన్యం ఇవ్వాలని ధర్మజాగరణ సమితి నాయకుడు గంధ్రకోట కుమార్ పిలుపునిచ్చారు. గత 25 ఏళ్లలో దాదాపు 300 మంది కార్యకర్తలు కమిటీలో పనిచేసి అనుభవం సంపాదించారని, అదే స్ఫూర్తితో వివిధ ప్రాంతాల్లో పండగలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది ఉత్సవాలు పూర్తయిన అనంతరం కమిటీని ట్రస్ట్‌గా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 20న సాయంత్రం 6గంటల నుండి రాత్రి 10గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. యువతీ యువకులు, పిల్లలు, మహిళా సంఘాలు జానపద నృత్యాలు, బతుకమ్మ గ్రూప్ డ్యాన్స్‌లు, అశ్లీలత లేని సినిమా పాటల ప్రదర్శనల్లో పాల్గొనవచ్చు. సింగిల్ డ్యాన్స్‌లకు అవకాశం లేదని, ఒక్కో బృందంలో 6 నుండి 50 మంది వరకు పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. పేర్ల నమోదు కోసం వాంకుడోత్ జ్యోతి 9701250210, మాలోత్ ప్రేమ్‌సింగ్ 8143101766 ను సంప్రదించాలని కోరారు. పాఠశాలలు, కళాభిమానులు చిన్నారులను ప్రోత్సహించాలని ఉత్సవ సమితి అధ్యక్షుడు కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సన్‌రైజర్స్ హెడ్‌మాస్టర్ పెట్టెం రాజు, ఆడెపు రాజు, అమర్నాథ్, శ్రీరాముల విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమం రద్దు



**ప్రజాపక్షం/జనగామ:** జనగామ కలెక్టరేట్‌లో సోమవారం (అక్టోబర్ 12న ) నిర్వహించాల్సిన జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. రైతు నేస్తం కార్యక్రమం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు వినతులు, ఫిర్యాదులతో కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు. డివిజన్, మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## ఎబివి కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** స్థానిక ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్‌లో 2002 05 బీకాం జనరల్ బ్యాచ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 21 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆనాటా జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా డా. సీతారాం, కృష్ణమూర్తి, విష్ణుచరణ్, సుదర్శనం, రాంరెడ్డి, నర్సింహులు, యాదగిరి, విజయ్‌కుమార్‌లను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భాస్కర్, అంజిరెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీకాంత్, భాస్కర్, అంజిరెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీకాంత్, భాస్కర్, రాధిక, ప్రశాంతి, మంజుల, రమ, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పెర కులస్తులను బిసి(ఎ)లో చేర్చాలి

**ప్రజాపక్షం/తొర్రూరు:** సగర(ఉప్పర) కులస్తులను బీసీ డీ నుంచి బీసీఏలో చేర్చాలని సగర సంఘం తొర్రూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి మార్క అరుణ్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సగర కులస్తులను మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్‌లో ఎందుకు చేర్చలేదని బిసి కమిషన్ చైర్మన్ నిలదీస్తే బిసి(ఎ) గ్రూపులో ఉన్న కులాలను మాత్రమే మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్‌లో చేర్చడం జరుగుతుందని సమాధానం ఇవ్వడం సరికాదన్నారు.సగర కులం సంచార జీవన విధానంతో ఎక్కడా పని దొరికితే అక్కడికి వలస వెళ్తూ జీవనం సాగిస్తామన్నారు. వలస జీవనం సాగించే కులాల్లో కూడా బిసి(ఎ) గ్రూపులో ఉన్న కులాలను మాత్రమే డీఎన్‌టీలో చేర్చడం జరిగిందన్నారు. సగర కులస్తులను అన్యాయం చేస్తున్నరని, మన హక్కుల సాధన కోసం ఉద్యమించాలన్నారు.